
సాక్షి అనంతపురం

గురువారం । 5 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.8 ప్రకారం పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరి రూ.5 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/13.6°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం కొనసాగింది. పగలు ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి తగ్గుదలగా నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

వలంటీర్‌పై ఎలుగుబంటి దాడి



చికిత్స పొందుతున్న హనుమంతరాయుడు

శెట్టూరు: యాటకల్లుకు చెందిన వలంటీర్ హనుమంతరాయుడుపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. బుధవారం తెల్లవారుజామున వలంటీర్ వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. పెట్రోల్ బంకు దాటి ప్రధాన రోడ్డు వద్దకు రాగానే పొదలచాటు నుంచి ఎలుగుబంటి దాడి చేసింది. ఈ హఠాత్పరిణామంతో వలంటీర్ గట్టిగా కేకలు వేయడంతో సమీప ఇళ్లలోని జనం పరుగున సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారి రాకను చూసిన ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. గాయపడ్డ హనుమంతరాయుడిని వెంటనే కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. రెండు నెలల కిందట గ్రామం పక్కనే ఓ చిరుత రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. వన్యమృగాలు తరచూ గ్రామ సమీపంలోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అడవిజంతువుల నుంచి తమను రక్షించాలని యాటకల్లు గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలో మెగా జాబ్‌మేళా

కళ్యాణదుర్గం: ఎస్‌ఈఈడీపీ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో త్వరలోనే మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని జాబ్స్ కో ఆర్డినేటర్ ఎం.ఓబిలేసు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రకటించిన ఆరో తేదీ జాబ్‌మేళాను వాయిదా వేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ మార్పును గమనించాలని సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు పూర్తి వివరాలకు 82478 85109, 63040 49368, 95508 37679, 78802 02003, 08554–280936 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీజీ మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సిటీ: అనంతపురంలోని జేఎన్‌టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాలలో ఎమ్మెస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో మిగిలిన స్పాన్సర్డ్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆ విభాగం డైరెక్టర్ ఆచార్య ఈశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. అర్హత ఉండి, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు, ప్రాసెసింగ్, ట్యూషన్ ఫీజుతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైద్యులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో ఖాళీగా ఉన్న మొత్తం 27 పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 10 మంది వైద్యులు హాజరు కాగా.. వారిలో తొమ్మిది మంది మాత్రమే ఉద్యోగాల్లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామీణస్థాయి నుంచి వైద్యాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగానే ఖాళీలు భర్తీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుజాత, చెన్నకేశవులు, సిబ్బంది పవన్, కమలాకర్ రాజు పాల్గొన్నారు.

నలుగురు ఏఓల నియామకం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు మండలాలకు ఏఓలను నియమించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన కె.స్వాతి గుంతకల్లుకు, ఎంఆర్ శ్రీనివాస్ వజ్రకరూరు, ఎ.మహేష్ కుందుర్పికి, ఎస్.జాఫ్‌ను కంబదూరుకు వ్యవసాయాధికారులుగా నియమితులైనట్లు వెల్లడించారు. వీరిలో కె.స్వాతి బుధవారం రిపోర్టు చేసుకోగా.. మిగతా ముగ్గురు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు.

వడివడిగా.. బడికి



విద్యారంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతులు కల్పించి.. బోధన ప్రమాణాలు మెరుగుపరుస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బడిఈడు పిల్లలను వెదికి వారిని తిరిగి బడిబాట పట్టించి.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

- ఇంటింటి సర్వేలో బడిఈడు పిల్లల గుర్తింపు
- డ్రాపౌట్ కారణాలపై సచివాలయ సిబ్బంది ఆరా
- తల్లిదండ్రులకు నచ్చజెప్పి బడికి పిల్లల సన్నద్ధత
- కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్‌లో వివరాల నమోదు.. పర్యవేక్షణ
- ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 7,479 మంది విద్యార్థులకు అడ్మిషన్లు



డ్రాపౌట్స్ సర్వే చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చింది. 'నాడు – నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి రూపురేఖలు మారుస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగేలా చర్యలు చేపట్టింది. బడి మానేసిన పిల్లలను తిరిగి బడి బాట పట్టించేందుకు కార్యాచరణ రూపొందించింది. డ్రాపౌట్‌కు గల కారణాలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని.. ఆ సమస్యలను పరిష్కరించి పిల్లలను తిరిగి బడిలో చేర్పిస్తోంది. 5 నుంచి 14 సంవత్సరాల్లోపు గల బడి మానేసిన పిల్లలను గుర్తించి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 7,479 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించింది.

సచివాలయాలే కేంద్రంగా..

డ్రాపౌట్స్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించేందుకు సచివాలయాల కేంద్రంగా స్కూళ్ల నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేకంగా కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సచివాలయ పరిధిలోని వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలు పాఠశాలలో చేరారో లేదో పరిశీస్తున్నారు. ఈ సర్వే, పాఠశాల విద్యాశాఖ అందించిన సమాచారం మేరకు బడి మానేసిన పిల్లల ఇళ్ల వద్దకు సంక్షేమ, విద్య అసిస్టెంట్, వార్డు విద్య డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వలంటీర్ వెళ్తున్నారు. పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. తల్లిదండ్రులకు నచ్చజెప్పి పిల్లల్ని బడికి తెచ్చేలా విద్యా అసిస్టెంట్లు వారికి నచ్చజెబుతున్నారు. ఎక్కువ కాలం బడికి రాకపోతే అందుకు గల కారణాలను ఇంటింటి సర్వేలో వలంటీర్లు సేకరిస్తున్నారు. పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారా? బాల్య వివాహాలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉన్నాయా అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. వాటికి పరిష్కారాలు చూపి, తల్లిదండ్రులకు నచ్చజెప్పి మరీ పిల్లల్ని పాఠశాలల్లోకి చేర్పిస్తున్నారు. ఆ వివరాలను, తల్లిదండ్రులతో మాట్లాడిన ఫొటోలను ఎప్పటికప్పుడు కన్సిస్టెంట్ రిథమ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

హాజరుపై నిరంతర పర్యవేక్షణ

పిల్లలు పాఠశాలకు వస్తున్న తీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటోంది. ఎవరైనా పిల్లలు వరుసగా మూడు రోజులు బడికి హాజరుకాకపోతే తల్లిదండ్రులకు వలంటీర్లు ఫోన్ ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. తిరిగి వారు బడికి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఉపాధ్యాయులు హాజరవుతున్నారా? లేదా అనే వివరాలను కూడా కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్స్‌లో నమోదు చేస్తున్నారు. సంక్షేమ విద్యా అసిస్టెంట్ వారంలో ఒక రోజు తన పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజన పథకం అమలు, పాఠశాల సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. నెలలో ఒక రోజు ఏఎన్‌ఎం సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాక్సినేషన్ వివరాలు సేకరిస్తున్నారు. వారంలో ఒక రోజు మహిళా పోలీసు పాఠశాలను సందర్శిస్తున్నారు. వీరందరూ తమ పరిశీలనలో వెల్లడైన వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ వివరాలకు అనుగుణంగా ఎక్కడైనా సమస్యలు, లోపాలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నారు.

తల్లిదండ్రులు అందుబాటులో లేకున్నా...



బాలికలకు నేరుగా కేజీబీవీలో రెసిడెన్షియల్ విద్యనందిస్తాం. మొత్తం 2,024 మంది విద్యార్థినులకు కేజీబీవీల్లో అడ్మిషన్లకు అర్హత కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి ఇప్పటికే మొత్తం 7,479 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో బడిఈడుకు తగ్గట్టు తరగతుల్లో అడ్మిషన్లు కల్పించాం.

– ఎం.వెంకటకృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ, అనంతపురం

నేటి నుంచి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే ప్రారంభోత్సవానికి ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ శ్రీనివాసన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఏడో తేదీ వరకు క్రీడా పోటీలు కొనసాగుతాయి.

మత్స్యరంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



'ఫిష్ ఆంధ్ర' యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లాలో మత్స్యరంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరు చేసిన 42 'ఫిష్ ఆంధ్ర' యూనిట్లను త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమీపంలోని ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను కలెక్టర్ సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్ని యూనిట్లు ఏర్పాటయ్యాయని ప్రశ్నించగా.. ఆరు యూనిట్లని మత్స్యశాఖ డీడీ శాంతి సమాధానమిచ్చారు. ఈ నెల పదో తేదీనాటికి కనీసం 14 యూనిట్లు ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరు చేసిన 42 ఫిష్ ఆంధ్ర యూనిట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద చేపల రవాణాకు మంజూరైన వాహనాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

శింగనమల టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- వెంకటాపురంలో ద్విసభ్య కమిటీ సభ్యులను అడ్డుకున్న బండారు శ్రావణి వర్గీయులు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకుండా ఎలా వస్తారంటూ నిలదీత
- ఎస్సీలను చులకనగా చూస్తున్నారని మండిపాటు



వెంకటాపురంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న బండారు శ్రావణి వర్గీయులు

శింగనమల: శింగనమల నియోజకవర్గ టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురంలో బుధవారం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామలింగారెడ్డిలను అదే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి వర్గీయులు అడ్డుకున్నారు. బుధవారం వెంకటాపురంలో టీడీపీ ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండారు శ్రావణిని ఆహ్వానించలేదు. ద్విసభ్య కమిటీ సభ్యులు, వారి వర్గీయులు మాత్రమే హాజరయ్యారు. దీంతో శ్రావణి వర్గీయులు ఆగ్రహానికి గురయ్యారు. ఇన్‌చార్జ్‌ను విస్మరించి మీరెలా వస్తారని, గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి అడుగుపెట్టనివ్వబోమంటూ అడ్డుకున్నారు. ఎస్సీ నియోజకవర్గమైనప్పటికీ ఆ వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఓసీ సామాజిక వర్గం వారిని ద్విసభ్య కమిటీ సభ్యులుగా నియమించి.. ఎస్సీలకు విలువ లేకుండా చేశారన్నారు. అయితే.. ద్విసభ్య కమిటీ సభ్యుల మద్దతుదారులు ఈలలు వేసుకుంటూ, శ్రావణి వర్గీయులను తోసుకుంటూ కాలనీలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ప్రత్యర్థులు ప్రతిఘటించడంతో చివరకు ఎస్సీ కాలనీలో కార్యక్రమం నిర్వహించకుండానే వెనుదిరిగారు.

తారస్థాయికి విభేదాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో శింగనమల నుంచి టీడీపీ తరఫున బండారు శ్రావణి పోటీ చేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి చేతిలో ఓడిపోయారు. తర్వాత శ్రావణిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారు. కానీ అదే పార్టీకి చెందిన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు నియోజకవర్గంలో పాగా వేయడానికి ప్రయత్నించారు. దీంతో 'తమ్ముళ్లు' రెండు వర్గాలుగా విడిపోయారు. శ్రావణిపై అసంతృప్తితో నియోజకవర్గ నాయకులు పార్టీ అధిష్టానానికి పదేపదే ఫిర్యాదులు చేశారు. అధిష్టానం ఆమెకు చెక్ పెడుతూ ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలతో ద్విసభ్య కమిటీని నియమించింది. ప్రస్తుతం ద్విసభ్య కమిటీ సభ్యులు ఒకవైపు, శ్రావణి మరోవైపు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రతి గ్రామంలోనూ టీడీపీలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి.

డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్



బెంగళూరు జైలు వద్ద ఆంటోనిని అరెస్ట్ చేస్తున్న 'అనంత' పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: డ్రగ్స్ రవాణా కేసులో కీలక సూత్రధారి నైజీరియాకు చెందిన ఆంటోనిని అనంతపురం పోలీసులు కర్ణాటకలో అరెస్ట్ చేశారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. గత డిసెంబర్ 20న అనంతపురం నగర శివారులోని ధాబా వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న కర్ణాటక రాష్ట్రం బెంగళూరు– నార్త్, ఎం.ఎస్.పలయ విద్యారణ్యపుర సమీపంలోని ముబారక్ వీధికి చెందిన సయ్యద్ అక్యూబ్ జావీద్, చిక్కబెట్టహళ్లికి చెందిన షేక్ పర్వేజ్‌ను త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు బృందం అరెస్ట్ చేసింది. డ్రగ్స్ సరఫరా–విక్రయ ముఠా వెనుక ఎవరున్నారనే కోణంలో విచారణ చేశారు. ఈ ముఠాకు కీలక సూత్రధారి ఆంటోని శామ్యూల్ అలియాస్ ఐకే అని తేల్చారు. అయితే ఇప్పటికే పలు కేసుల్లో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆంటోని అరెస్ట్ కష్టతరంగా మారింది. మంగళవారం బెంగళూరులో జైలు వద్ద ఆంటోనిని అనంతపురం పోలీసులు పీటీ వారంట్ కింద అరెస్ట్ చేశారు. బుధవారం అనంతపురంలోని మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆంటోనిని రిమాండ్‌కు తరలించారు.

అసాంఘిక శక్తులను అణచివేస్తాం


జిల్లాకు చెందిన నేరగాళ్లు ఇతర ప్రాంతవాసులతో కలిసి నేరాలకు తెగబడతామంటే పోలీసు శాఖ చూస్తూ ఊరుకోదు. ఇప్పటికే నకిలీ కరెన్సీ, ఆయుధాల సరఫరా, కిరాయి హత్యలు, గంజాయి రవాణా – విక్రయాలు వంటి కార్యకలాపాలు కొనసాగించే ముఠాను సైతం వదల్లేదు. తాజాగా డ్రగ్స్ మాఫియాలో కీలక సభ్యుడైన నైజీరియాకు చెందిన ఆంటోనీని పట్టుకుని కటకటాలకు పంపాం. జిల్లా చరిత్రలో డ్రగ్స్ కేసులో నైజీరియన్ పట్టుబడింది ఇదే మొదటిసారి. యువతను పెడదారి పట్టించే డ్రగ్స్ జిల్లాలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. అసాంఘిక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తాం.

– ఫక్కీరప్ప, ఎస్పీ

ఉద్యాన పంటల సాగు లాభదాయకం

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులకు జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. రోటరీపురంలో బుధవారం వారు పర్యటించి, ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటి వనరులతో పంటలు సాగు చేయవచ్చునన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. చీనీ, బొప్పాయి, అరటి, దానిమ్మ వంటి పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఉద్యాన పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ జగన్‌మోహన్, ఎంఐఓ హరిత రైతులు పాల్గొన్నారు.

సరిహద్దులో హెచ్చెల్సీకి తగ్గిన నీరు



ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీ వద్ద ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద బుధవారం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. ఇప్పటి వరకూ సరిహద్దులో 25 టీఎంసీల వరకు నీరు విడుదలైనట్లు కణేకల్లు హెచ్చెల్సీ డీఈ గోపాల్ నాయక్ తెలిపారు. హెచ్‌ఎల్‌ఎంసీ పరిధిలో పంటలకు నీటి సరఫరా నిలుపుదల చేయడంతో సరిహద్దులో హెచ్చెల్సీకి 2 వేల క్యూసెక్కుల నుంచి వెయ్యి క్యూసెక్కులకు తగ్గించినట్లు వివరించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని కణేకల్లు చెరువు మీదుగా పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలతో పాటు జీబీసీకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జలాశయం నుంచి తక్కువ నీటిని తీసుకుంటే మరిన్ని రోజులు ఎక్కువగా నీరు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అయితే ప్రస్తుతం విడుదలవుతున్న నీరు హెచ్‌ఎల్‌ఎంసీ పరిధిలోని తూములకు అందడం లేదని రైతులు తెలిపారు. హెచ్చెల్సీ కింద జొన్న, పత్తి, మిరప, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి పంటలు సాగులో ఉన్నాయని, కనీసం ఫిబ్రవరి ఆఖరు వరకూ పంటలకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యం విక్రయించండి : డీఎస్‌ఎం

బొమ్మనహాళ్: దళారులను నమ్మి తక్కువ ధరకే ధాన్యం అమ్మి మోసపోవద్దని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ (డీఎస్‌ఎం) నీలమయ్య రైతులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్, గొనూరు గ్రామాల వద్ద ఉన్న వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఉద్దేహాళ్ సొసైటీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆసక్తి గల రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామని వెల్లడించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ.2,060, బి గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ.2,040 ప్రకారం కొనుగోలు చేస్తామని చెప్పారు. 4,200 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించుకోవాలని సూచించారు. నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు ఉంటుందని, ఇందుకు రైతులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రాయదుర్గం సబ్ డివిజన్ కోఆపరేటర్ చంద్రమోహన్, సీఈఓ హనుమంతు పాల్గొన్నారు.

పరమత సహనంతోనే శాంతి



సర్వమత సమ్మేళనంలో మాట్లాడుతున్న పీఠాధిపతి తాజ్‌బాబా

- ఘనంగా బాబయ్య దర్గా ఉరుసు ఉత్సవాలు

పెనుకొండ: 'సర్వమతాల సారం ఒక్కటే.. ఈ విశ్వంలో భగవంతుడూ ఒక్కరే. కాకపోతే ఒక్కొక్కరూ ఒక్కో రూపంలో పూజిస్తుంటారు. అందరూ గొప్పవారే. అన్ని మతాలూ గొప్పవే. అందువల్ల అందరూ పరమత సహనం పాటించాలి. అప్పుడే శాంతి పరిఢవిల్లుతుంది' అని ఆధ్యాత్మిక వేత్తలు పిలుపునిచ్చారు. పెనుకొండ బాబయ్య దర్గా 750వ ఉరుసు ఉత్సవాల్లో బుధవారం రాత్రి మొదటి గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గంధం పీఠాధిపతి సజ్జద్‌బాబా, ఆయన కుటుంబీకులు మతపెద్దలు వెంటరాగా గంధాన్ని తలపై ఉంచుకుని ఇంటి నుంచి బయలుదేరారు. భక్తుల కోలాహలం నడుమ బాబయ్య స్వామి సమాధి వద్దకు చేరుకుని గంధాన్ని సమర్పించారు. అనంతరం బాబయ్య స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గా ఆవరణలో పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో సర్వమత సమ్మేళనం నిర్వహించారు. వక్తలు ప్రసంగిస్తూ ప్రస్తుతం మత ఘర్షణలు పెరిగి అశాంతి నెలకొందన్నారు. ప్రజలు సహనం పాటిస్తూ... ప్రేమ, అనురాగం, అభిమానంతో జీవితం సాగించాలన్నారు. మత సామరస్యం పరిఢవిల్లినప్పుడే పురోగతి సాధ్యమన్నారు.

50 మందికి జాతీయ సమైక్యత పురస్కారాలు

దర్గా ఉత్సవాల సందర్భంగా జాతి సమైక్యత, మతసామరస్యం కోసం పాటు పడిన 50 మందికి జాతీయ సమైక్యత పురస్కారాలు అందజేశారు. అవార్డు గ్రహీతల్లో కర్నూలుకు చెందిన సాయి సంస్థాన్ పీఠాధిపతి శివసాయి గురూజీ, బెంగళూరుకు చెందిన నాగభైరవ, కర్ణాటకకు చెందిన శివ మృత్యుంజయ, బ్రహ్మకుమారీయ విశ్వవిద్యాలయం సిస్టర్ డా.హేమలత, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ చిలకల మస్తాన్, సినీనటి గాయత్రి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. 36 ఏళ్ల నుంచి దేశ సమైక్యత కోసం, మత సామరస్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సైతం జాతీయ సమైక్య పురస్కారం అందుకున్నారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ


ఆలయ అధికారి ముకుందారెడ్డికి విరాళం అందజేస్తున్న తమ్మినేని చిన్నప్ప

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్న దాన పథకానికి అనంతపురం జిల్లా వాసి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి బుధవారం తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మినేని చిన్నప్ప.. తన తల్లిదండ్రులు ముత్యాలమ్మ, కంబన్నమ జ్ఞాపకార్థం నగదు అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా దాతల పేరున ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రవిచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

డీఐజీని కలసిన ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్‌ని బుధవారం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఆ జిల్లా అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీలు హుస్సేన్ పీరా, ఉమామహేశ్వర రెడ్డి, పలువురు సీఐలు ఉన్నారు.

ఇంటి ముంగిటకే ఆధార్

- జిల్లాలోని 103 సచివాలయాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- ఇప్పటికే 61 కేంద్రాల్లో ప్రారంభం
- ప్రతి ఐదు సచివాలయాలకు ఓ కేంద్రం
- గ్రామాల్లో శిబిరాల ఏర్పాటుకు శ్రీకారం
- ప్రజలకు తొలగిన ఆధార్ కష్టాలు


పాఠశాలలోనే అందుకున్న ఆధార్ కార్డులను చూపుతున్న విద్యార్థులు

జిల్లాలో వార్డు /గ్రామ సచివాలయాలు	667
ప్రతిపాదించిన ఆధార్ కేంద్రాలు	134
మంజూరైన మొత్తం ఆధార్ కేంద్రాలు	103
ప్రారంభమైన కేంద్రాలు	61
ప్రజలు అందుకున్న ఆధార్ సేవలు	1,22,330

రాయదుర్గం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే ఏ సంక్షేమ పథకం లబ్ధి పొందాలన్నా.. వ్యక్తిగత ఆధారాల కోసం, ఇతర బ్యాంక్ వ్యవహారాల కోసం ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. అయితే, ఈ కార్డుల జారీలో చోటు చేసుకుంటున్న జాప్యం, తప్పులు, ఇతర ఇబ్బందులను సరి చేసుకునే ప్రక్రియలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన జగనన్న సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రజా సంక్షేమానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ఆధార్ కార్డుల విషయంలోనూ మరో అడుగు ముందుకు వేశారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆధార్ కార్డుల జారీ, వాటిలో సమస్యల పరిష్కారానికి వీలుగా గ్రామ సచివాలయాల్లోనే ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజలు ఇకపై ఈ–సేవ కేంద్రాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేదు. రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి అంతకన్నా లేదు.

నిరీక్షణకు చెక్

మారిన యాంత్రిక జీవనంలో సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకూ ఆధార్ తప్పనిసరి అయింది. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా.. ఆర్థిక లావాదేవీలు జరపాలన్నా ఆధార్ లేకపోతే సాధ్యం కాదు. ఇంతటి కీలకమైన ఆధార్ కార్డుల మంజూరు, తప్పొప్పుల సవరణ అంశంలో గత టీడీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పుట్టిన బిడ్డ మొదలు.. పండు ముదసలి వరకూ ఆధార్ సేవల కోసం రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాసేవారు. ఈ ఇబ్బందులను గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకే ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా 667 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా... ప్రతి ఐదు సచివాలయాలకు ఒకటి చొప్పున 134 ఆధార్ కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో 103 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. కేంద్రాల నిర్వహణకు అవసరమైన యంత్ర, సామగ్రి సమకూరిన 61 సచివాలయాల్లో ఇప్పటికే ఆధార్ సేవలను అధికారులు ప్రారంభించారు. ఈ నెలాఖరులోపు మరో 42 కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు గ్రామాల్లో సంచార ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహకాలు చేపట్టారు.

నామమాత్రపు రుసుంతో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆధార్ కార్డుల జారీకి, మార్పులు–చేర్పులకు కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా ధర నిర్ణయించి ప్రజలను దోచేశారు. లబ్ధిదారుల అవసరాన్ని బట్టి రూ.200 నుంచి రూ.వెయ్యి వరకూ వసూలు చేసుకున్నారు. ఆధార్ కేంద్రాల నిర్వాహకులు సాగిస్తున్న దోపిడీని అరికట్టడంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నామమాత్రపు రుసుంతో ఆధార్ సేవలు అందుతున్నాయి. సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో చిరునామా, పుట్టిన తేదీ, సెల్‌ఫోన్ నంబర్ చేర్పు వంటి సేవలను సాధారణ మార్పులుగా పరిగణించి రూ.50 రుసుం వసూలు చేస్తున్నారు. బయోమెట్రిక్ సేవల్లో భాగంగా వేలిముద్రలు, ఫొటో, ఐరీస్ సేకరణకు రూ.100, ఏటీఎం, పాన్‌కార్డుల తరహాలో ఆధార్‌కార్డు పొందేందుకు రూ.50, ఆధార్ కార్డు ప్రింట్ తీసి ల్యామినేషన్ చేసిస్తే రూ.30 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

అన్ని గ్రామాల్లోనూ సేవలు



ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి సచివాలయంలోనూ ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఆధార్ కార్డుల జారీ చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరంలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

సద్వినియోగం చేసుకోవాలి



సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ప్రస్తుతం 61 కేంద్రాల ద్వారా సేవలు అందుతున్నాయి. త్వరలో మరిన్ని కేంద్రాలు ప్రారంభిస్తాం. దీనికి తోడు గ్రామాల్లో సంచార ఆధార్ కేంద్రాలను నిర్వహించి, ప్రజలకు మరింత నాణ్యమైన సేవలను అందజేస్తాం.

– భాస్కరరెడ్డి, జెడ్పీ సీఈఓ, అనంతపురం

బాబు రక్తదాహం ఆగేదెన్నడు?

- 'దుర్గం'లో కాపు భారతి ఆధ్వర్యంలో మహిళల మౌన నిరసన


నిరసన ర్యాలీ చేస్తున్న కాపు భారతి, మహిళలు

రాయదుర్గం టౌన్: ప్రచార ఆర్భాటంతో చంద్రబాబు ఉన్మాదిలా మారి అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్నారని, ఇకనైనా రక్తదాహం తీర్చుకోవడాన్ని ఆపాలని చంద్రబాబుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి హితవు పలికారు. నెల్లూరు జిల్లా కందుకూరు, గుంటూరు సభల్లో 11 మంది ప్రాణాలు బలిగొన్న చంద్రబాబు తీరుకు నిరసనగా బుధవారం సాయంత్రం కాపు భారతి ఆధ్వర్యంలో మహిళలు, కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పిస్తూ ర్యాలీ చేపట్టారు. రాయదుర్గంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీబజార్, పాతబస్టాండ్ మీదుగా వినాయక సర్కిల్ వరకూ సాగింది. ఈ సందర్భంగా కాపు భారతి మాట్లాడుతూ.. 40 ఏళ్ల చంద్రబాబు రాజకీయ అనుభవం ప్రజలను ప్రాణాలు బలిగొంటోందని విమర్శించారు. కేవలం పబ్లిసిటీ కోసం అమాయకుల ప్రాణాలు బలిగొనడం దారుణమన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గోదావరి పుష్కరాల్లోనూ 29 మంది ప్రాణాలు కోల్పోయేందుకు కారుకుడయ్యాడని గుర్తు చేశారు. ఈ మరణాలన్నిటికీ చంద్రబాబునే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే దిశగా అన్ని పార్టీలకు వర్తించేలా సభలు, రోడ్‌షోల నిర్వహణపై ప్రభుత్వం చట్టం చేస్తే అవహేళన చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ వలిబాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవ రెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, శారదాదేవి, శ్రీలక్ష్మి, డిష్ గోవిందు, పెద్ద వన్నూరుస్వామి, ఫకృద్దీన్, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు నజీర్, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, బషీర్ అహ్మద్, నిజాముద్దీన్, రామాంజనేయులు, పద్మావతి, కృష్ణమూర్తి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక మందుల వినియోగం తగ్గించండి

బుక్కరాయసముద్రం: పంటల సాగులో రసాయనిక మందుల వినియోగం తగ్గించాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) చంద్రానాయక్ సూచించారు. బీకేఎస్ మండలం దయ్యాలకుంటపల్లిలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని, పంటల సాగుపై రైతులను చైతన్య పరిచారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. విత్తన శుద్ధి తప్పక చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, విత్తన ధ్రువీకరణ అధికారి రవికుమార్, మండల వ్యవసాయాధికారి శ్యామసుందరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అనాథలా.. ఆస్పత్రిలోనే..!


మృతుడు రెడ్డి మోహన్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని అనాథగా ఆస్పత్రిలో చేర్పించి వదిలేశారు. అయిన వారు లేక ఆస్పత్రిలోనే ఆయన మృతి చెందాడు. అనంతపురం సర్వజనా స్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని అన్నమయ్య జిల్లా మొలకలచెరువు గ్రామానికి చెందిన కృష్ణమాచారి కుమారుడు రెడ్డి మోహన్(60)గా అనంతపురం రెండో పట్టణ పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని గత ఏడాది డిసెంబర్ 30న సర్వజనాస్పత్రిలో చేర్పించి వెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. అడ్మిషన్ కార్డులో రాయించిన చిరునామా మేరకు మృతుడిని రెడ్డి మోహన్‌గా గుర్తించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

రెండో రోజూ పరిశీలన

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలో అధికారిక తనిఖీలు రెండో రోజూ బుధవారం కొనసాగాయి. పలు రికార్డులను ఆడిటర్లు మాధవి, రాంబాబు, అన్నపూర్ణ పరిశీలించారు. పదేళ్ల పాటు పంటసాగు కోసం వెచ్చించిన ఖర్చులు, ఆదాయాలు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు.

పెనుకొండ టీడీపీలో ముసలం

పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ముసలం పుట్టింది. కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవిత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప వరుస కార్యక్రమాలతో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాబోవు ఎన్నికల్లో గెలుపు మాట అటుంచితే పార్టీ టికెట్ పార్థుడికి దక్కడం కష్టమేనన్న వాదన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

సవిత ధీమా .. : రాబోవు ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు టీడీపీ అధిష్టానం ప్రకటించడంతో కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవితలో ఆశలు రేకెత్తాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు విస్తృతం చేశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ టికెట్ తనకేనంటూ ఇప్పటికే పార్టీ శ్రేణులకు స్పష్టం చేసిన ఆమె.. ఇతర జిల్లాల్లోనూ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటూ తన ఇమేజ్‌ను పెంచుకునే చర్యలు ముమ్మరం చేశారు.

కలిసొచ్చిన రాజకీయ శత్రువు.. : మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు మధ్య ఉన్న రాజకీయ శత్రుత్వం సవితకు కలిసొచ్చింది. పార్థుడిని ఎలాగైనా దెబ్బ తీయాలన్న కసి నిమ్మలలో వ్యక్తమవుతోంది. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బీకే ప్రతి సమావేశంలోనూ నిమ్మలను అవమానపరుస్తూ వచ్చారు. దీంతో పార్థుడి ఓటమే లక్ష్యంగా కిష్టప్ప తన రాజకీయ అస్త్రాలను ఎక్కు పెట్టారు. ఈ క్రమంలో సవితకు కిష్టప్ప మద్దతు ఇస్తున్నట్లుగా పార్టీ శ్రేణులు బాహాటంగానే పేర్కొంటున్నాయి. దీనికి తోడు తన కుమారులు అంబరీష్, శిరీష్‌లో ఎవరో ఒకరికి పార్టీ టికెట్ దక్కించుకునేందుకు కిష్టప్ప పావులు కదుపుతున్నారు. పుట్టపర్తి లేక పెనుకొండ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానం నుంచి కుమారులను బరిలో దించేందుకు కిష్టప్ప ప్రయత్నాలు చేస్తున్నారు. అదే సమయంలో ఎలాగైనా తన భార్యకు పార్టీ టికెట్ దక్కించుకునేందుకు సవిత భర్త వెంకటేశ్వర చౌదరి పెద్ద ఎత్తున లాబీయింగ్ మొదలు పెట్టారు. కానీ బీకే మాత్రం అధిష్టానానికి తనపైనే ఎంతో గురి ఉందని, ప్రజల్లోనూ తనకే పట్టు ఉందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ధీమాతోనే పార్టీలో ఏ ఒక్కరినీ ఆయన ఖాతరు చేయడం లేదు.

ఎడమొహం.. పెడమొహం.. : పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీలో గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయి. బీకే పార్థసారథి ఓ కార్యక్రమాన్ని చేపడితే దానికి ప్రతిగా సవిత మరో కార్యక్రమానికి పిలుపునిస్తోంది. దీంతో నిన్నామొన్నటి వరకూ బీకే వెంట నడిచిన పలువురు ముఖ్య నాయకులు సవితమ్మ గ్రూపులోకి చేరారు. ఇక ఏదైనా కార్యక్రమంలో ఇరు వర్గాలు ఎదురుపడ్డా.. ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నాయి. అంతటితో ఆగకుండా దూషణల పర్వానికి తెర తీస్తున్నాయి. ఇటీవల పెనుకొండలోని బోయగేరిలో పార్థుడి నేతృత్వంలో జరిగిన ఓ కార్యక్రమం ఇందుకు అద్దం పడుతోంది. తమ ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఆ కార్యక్రమంలో పాల్గొనరాదంటూ పార్థుడి ముఖ్య అనుచరుడు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాడు. ఇది వర్గ పోరుకు మరింత ఆజ్యం పోసింది.

పోటాపోటీగా కార్యాలయాలు.. : పెనుకొండలో టీడీపీ నాయకులు రెండు కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. తన స్వగృహంలోనే పార్థుడు కార్యాలయం నిర్వహిస్తుండగా.. ప్రతిగా ఎన్టీఆర్ సర్కిల్‌లో సవితమ్మ చేత మరో కార్యాలయాన్ని ఆమె వర్గీయులు ఏర్పాటు చేయించారు. అంతటితో ఆగకుండా పోటాపోటీగా కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కిందిస్థాయి కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారు. ఎన్నికలకు మరో ఏడాదిన్నర కాలం ఉండడంతో ముగ్గురు నాయకుల మధ్య తీవ్ర విభేధాలు చంద్రబాబు, లోకేష్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

ప్రమాదంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌కు గాయాలు

పుట్లూరు: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో శింగనమల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకట్రామిరెడ్డి గాయపడ్డారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న ఆయనను ఆటో ఢీకొంది. గాయపడిన వెంకట్రామిరెడ్డిని స్థానికులు తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

రాజస్తాన్ వాసి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాత పోస్టాఫీసు వద్ద రాజస్తాన్‌కు చెందిన షబ్బీర్ (22) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రవి శంకరరెడ్డి తెలిపిన మేరకు... రాజస్తాన్‌లోని జోథ్‌పూర్‌కు చెందిన షబ్బీర్ రెండేళ్ల క్రితం హర్యానా జిలేబీ, సమోసాల తయారీ మాస్టారుగా పనిలో చేరాడు. యజమాని శంకర్ రాజస్తాన్‌కు వెళుతూ తన దుకాణాన్ని షబ్బీర్ సోదరులకు లీజుకిచ్చాడు. వారం రోజుల క్రితం సొంతూరికి వెళ్లిన షబ్బీర్ బుధవారం ఉదయం అనంతపురం వచ్చాడు. కారణం తెలియదు గాని.. బుధవారం మధ్యాహ్నం బాత్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

గాండ్లపెంట: అనారోగ్య పరిస్థితిని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం సానుచేనుబైలుకు చెందిన కొండమేని గంగయ్య ఐదేళ్ల క్రితమే కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో గ్రామంలోని బంధువుల ఇంట్లో మంగళవారం జరిగిన అయ్యప్పస్వామి ఇరుముడి కార్యక్రమానికి గంగయ్య కుమారుడు శ్యామ్‌ప్రసాద్ (22) హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన తర్వాత అదే రోజు రాత్రి గ్రామంలోని సొంతింట్లో నిద్ర పోయాడు. బుధవారం ఉదయం ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో 9 గంటల సమయంలో బంధువు రామాంజులు వెళ్లి తలుపు తీసి చూశాడు. లోపల చీరతో వేసుకున్న ఉరికి వేలాడుతున్న శ్యామ్‌ప్రసాద్ మృతదేహాన్ని చూసి, విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు చేరవేశాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో నూతన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులందరికీ కుల,మత పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా సామాజిక పింఛన్‌లను రూ. 2,750కు పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలో నూతంగా 169 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. గతంలో ఈప్రాంతానికి చెందిన వారే మంత్రులు, ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పటికీ పేద ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు హంద్రీనీవా ద్వారా నీరందించినట్లు గుర్తు చేశారు. అలాగే నియోజకవర్గంలోని అన్నిచెరువులకు నీరందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే రామగిరి బంగారు గనులను తెరిపిస్తామని, ఈక్రమంలో నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తామని వివరించారు. అంతేకాకుండా తోపుదుర్తి ట్రస్ట్ ద్వారా రైతులకు ఉచితంగా బోర్లను వేయిస్తున్నామని, పాల డెయిరీని ఏర్పాటుచేసి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లను నిర్మిస్తున్నామని, మండలంలో 4 వేలకుపైగా అర్హులకు ఇళ్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివారెడ్డి, తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్, ఎంపీపీ కత్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ రమేష్, వైస్ ఎంపీపీ సంపత్ కుమార్, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, సిద్దన్న, నరేంద్ర, రామ్మూర్తి, ఓబిరెడ్డి, చెన్నకేశవరెడ్డితో పాటు నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, రామ్మోహన్, రాజశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, రామలింగారెడ్డి, బోయ నాగేంద్ర, రామాంజినమ్మ, రామక్రిష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అంచనాలకు మించి అభివృద్ధి, సంక్షేమం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో ప్రజల అంచనాలకు మించి అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దెలలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజక వర్గంలోని 32 వేల మందికి పింఛన్ల అందిస్తుండటంతో పాటు 27 వేల మంది కొత్తగా ఇళ్ల మంజూరు చేయించామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నియోజక వర్గంలో ప్రతి ఇంటికీ ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ అశోక్, ఎంపీపీ మజ్జిగ అంజలి, తదితరులున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురం పంచాయతీ రెడ్డివారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు బుధవారం తెలుగు దేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆ గ్రామానికి చెందిన లక్ష్మన్న, పోతన్న, గంగాధర్, ముత్యాలు, పరిమళకు చెందిన ఐదు కుటుంబాలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ క్రమంలో వారందరినీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నప్పటికీ పరిటాల కుటుంబ సభ్యులు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కత్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ రమేష్‌లతో పాటు ఎంపీటీసీ వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లల ఉజ్వల భవితకు ప్రభుత్వం చర్యలు


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో కోగటం

అనంతపురం క్రైం: పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ కాలనీలోని సెయింట్ మేరీ గర్ల్స్ హై స్కూల్ (చర్చి స్కూల్)లోని విద్యార్థినులకు డిప్యూటీ మేయర్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం మరియా సిస్టర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు పడాలి

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం సూర్యనగర్, ఉమానగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా చూసుకోవాలన్నారు. నగర ప్రజలు డస్ట్‌బిన్‌లలో చెత్తను వేయాలన్నారు. కమిషనర్ వెంట డీఈ చంద్రశేఖర్, తదితరులున్నారు.

న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడాలి


కిష్టప్పను సన్మానిస్తున్న న్యాయవాదులు

అనంతపురం సిటీ: సమాజంలో న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని బీసీ కమిషన్ సభ్యుడు, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అభిప్రాయపడ్డారు. అనంతపురం బార్‌లో నూతనంగా ప్రాక్టీస్ ప్రారంభించిన యువ న్యాయవాదులకు క్రిమినల్ మేజర్ యాక్ట్ పుస్తకాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'లా నేస్తం' న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టే యువ న్యాయవాదులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి పథకాలు లేక ఎంతోమంది నిరుత్సాహానికి గురయ్యేవారని తెలిపారు. ప్రభుత్వానికి యువత రుణపడి ఉండాలని కోరారు. అనంతరం కిష్టప్పను న్యాయవాదులు పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. న్యాయవాది హనుమప్పతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా

అనంతపురం సిటీ: బుధవారం విడుదలైన ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని విద్యా సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. అనంతపురంలోని కమ్మభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంటీఎస్ఓకు 882 మంది, ఎస్‌టీఎస్ఓకు 807 మంది, ఈటీఎస్ఓకు 763 మంది, జీటీఎస్ఓకు 758 మంది, ఏటీఎస్ఓకు 448 మంది కలిపి మొత్తం 3,658 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వారంతా రెండో లెవల్‌కు అర్హత సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు పర్వీన్‌బాను, తబుసుమ్, ఖలందర్, షామీనా ఖాన్, నేత్రావతి, శాంత, శ్రీదేవి, స్వరూప, విశ్వనాథ, కో–ఆర్డినేటర్లు, డీన్‌లు, పాల్గొన్నారు.

జగన్‌కు ఎల్లప్పుడూ పేదలపైనే ఆలోచన


వైఎస్సార్ బీమా చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎల్లప్పుడూ పేదల సంక్షేమం గురించి ఆలోచించే మనసున్న మహరాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. ప్రభుత్వం పలువురికి మంజూరు చేసిన వైఎస్సార్ బీమా చెక్కులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పంపిణీ చేశారు. బుధవారం స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. అభివృద్ధి కూడా పరుగులు పెడుతోందన్నారు. టీడీపీ నాయకులు ఓర్వలేక నాటకాలు మొదలుపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, నాయకులు కట్టుబడి తానీషా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

సంక్రాంతిని పురస్కరించుకుని ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల అనిల్ గౌడ్, అమ్మ సిల్వర్ ప్యాలెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీల పోస్టర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖర్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జయచంద్రనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుజాతరెడ్డి, భారతీరెడ్డి, ఎద్దుల అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, భారతి, జయమ్మ, శివగౌడ్, జగదీష్ గౌడ్, భాస్కర్ గౌడ్, మహేష్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉన్నతికి అన్ని విధాలా సహకారం



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

• జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సప్తగిరి సర్కిల్: సకలాంగులతో పాటు దివ్యాంగులు కూడా ఉన్నతంగా జీవించేలా వారికి అన్ని విధాలా ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. స్థానిక పీటీసీ క్రీడా మైదానంలో బుధవారం అంధ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎలాంటి కార్యాన్నైనా సాధించుకునే పట్టుదల, కృషి దివ్యాంగుల్లో ఉంటుందన్నారు. ఏటా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహిస్తున్న అంధ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులను అభినందించారు. దివ్యాంగులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు చేయూతనిస్తామన్నారు. అనంతరం క్రికెట్, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్, అంధ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

అనంతపురం కల్చరల్: జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నగర శివారులోని నేషనల్ పార్కులో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నగరవీధుల్లో అంధులు ర్యాలీ నిర్వహించారు. కృష్ణకళామందిరంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మేయర్ వసీం హాజరై మాట్లాడారు. అంధుల జీవితాలకు భరోసానిచ్చిన లూయిస్ బ్రెయిలీ ఆదర్శప్రాయుడన్నారు. అంధుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున, జిల్లా అధ్యక్షులు విజయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి రవి, అంకిరెడ్డి, విజయ్‌సాయి కుమార్, రవికాంత్ రమణ తదితరులు మాట్లాడారు. అంధుల కోసం ప్రత్యేక సమావేశ భవనం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయిట్రస్టు, మీనాక్షి ఫౌండేషన్, పద్మలత తదితరులు విజేతలకు బహుమతులందించారు. 200 బ్యాగులను వితరణ చేశారు. కార్యక్రమంలో సేక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న, హనుమక్క, లక్ష్మినారాయణమ్మ, నాగశివ, సంజప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కారుణ్య నియామకం

అనంతపురం క్రైం: మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో బుధవారం సర్వణదత్త అనే వ్యక్తికి ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి కారుణ్య నియామకం కల్పించారు. గతంలో ఉరవకొండ డిపోకి చెందిన కండక్టర్ ఆర్ రామమోహన్ మృతి చెందారు. కారుణ్య నియామకం కింద అతని కుమారుడైన సర్వణదత్తకు హిందూపురం మునిసిపాలిటీలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు.

'కాంపోజిట్ సిలిండర్లు సురక్షితం'

అనంతపురం సిటీ: ప్రస్తుతం వినియోగంలో ఉన్న గ్యాస్ సిలిండర్ల (ఉక్కు) కంటే కాంపోజిట్ సిలిండర్లు సురక్షితమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలో కాంపోజిట్ సిలిండర్ల పంపిణీని బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం వాడకంలో ఉన్న సిలిండర్ల కంటే సులువుగా తీసుకెళ్లేందుకు అనువైనవిగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు ఎస్‌ఐగా ఆంజనేయులు

రాప్తాడు: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని ఎస్‌ఐ పీవై ఆంజనేయులు పేర్కొన్నారు. రాప్తాడు మండల ఎస్‌ఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

'ఎస్‌వీఐటీ'లో క్యాంప్ ఫైర్

రాప్తాడు: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవను అలవరచుకోవాలని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలో హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా కళాశాలలో బుధవారం క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, సర్పంచు ప్రభావతి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ ఎస్సీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, కళాశాల చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

అనంతపురం సిటీ: జేఎన్‌టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాలలో జరుగుతున్న బీఫార్మసీ నాల్గో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలను ఉప కులపతి ఆచార్య రంగజనార్దన బుధవారం పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు, గైర్హాజరైన విద్యార్థులు ఎంత మంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ప్రొఫెసర్లు, సిబ్బంది ఉన్నారు.

విజయ్‌కుమార్ మరణం తీరనిలోటు

అనంతపురం కల్చరల్: ఘంటసాలగా కీర్తికెక్కిన విజయ్‌కుమార్ మరణం సంగీత లోకానికి తీరని లోటని పలువురు కళాకారులు సంతాపం వెలిబుచ్చారు. ఈ మేరకు సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకరబాబు, వివిధ సంగీత బృందాలకు చెందిన నాగినిప్రసాద్, నాట్యాచార్యులు విశ్వనాథ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సానుభూతి వ్యక్తం చేశారు. వందల సంగీత విభావరులలో విజయ్‌కుమార్ అద్భుతంగా ఆలపించారని గుర్తు చేసుకున్నారు.

బీమా మొత్తాన్ని జాగ్రత్తగా వాడుకోవాలి

అనంతపురం క్రైం: వైఎస్సార్ బీమా మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం జాగ్రత్తగా వాడుకోవాలని మేయర్ వసీం పేర్కొన్నారు. 48వ డివిజన్ రజకనగర్‌కు చెందిన వెంకటేష్ అనే డ్రైవర్ గతేడాది ఆగస్టులో ప్రమాదవశాత్తు మరణించాడు. వెంకటేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు మంజూరైంది. మొదటి విడతలో రూ.10,000 గతంలోనే అందజేశారు. మిగతా రూ.4,90,000 మొత్తం మృతుడి భార్య వీణకుమారి బ్యాంకు ఖాతాలో జమైంది. బుధవారం మేయర్ వసీం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు, ఇస్సాక్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పీటీడీ ఎండీని కలసిన వైఎస్సార్ ఈయూ నాయకులు

అనంతపురం క్రైం: పీటీడీ ఎండీ(ఆర్టీసీ) ద్వారకా తిరుమల రావును విజయవాడలోని ఆయన కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షులు ఆర్‌వీ భాస్కర్ రెడ్డి, నాయకులు విశ్వనాథ్ రెడ్డి, సుందర్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఈడీ కోటేశ్వర రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న స్టాలిన్ నగర్‌కు చెందిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్టాలిన్‌నగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి వడియంపేట సమీపంలో వాటర్ పాకెట్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి బైకులో వస్తుండగా పాములాయి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. గాయపడిన శ్రీనివాసరెడ్డిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు నవీన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సీపీఎం కాలనీలో కొత్తగా అంగన్వాడీ భవన నిర్మాణానికి బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, గ్రామ సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, ఉపసర్పంచ్ బండి రమేష్ భూమి పూజ చేశారు. అనంతరం వారు పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది, వార్డు మెంబర్లు, వలంటీర్లు, పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ..'

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తిలో గురువారం ఉదయం 8 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: రంగస్వామినగర్‌లో వెలసిన నసనకోట ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు టీవీ నారాయణ స్వామి నేతృత్వంలో ఉదయం సుప్రభాత సేవలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలు సమర్పించిన అనంతరం సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయ కులు బీసీ రమేష్‌గౌడ్, ఆదినారాయణ గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, స్ఫూర్తి రవిశేఖర రెడ్డి, నరసింహులు తదితరులున్నారు.

8న ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్: రాజు రోడ్డులోని అవోపా ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళలకు ఈనెల 8న సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు అవోపా పట్టణ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 6 వేలు, రెండో బహుమతి రూ. 5 వేలు, మూడో బహుమతిగా రూ.4 వేలు అందిస్తామన్నారు. 7013575137, 9885232129 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.